# వైకుంఠ ఏకాదశి మహోత్సవాలకు సీఎం రేవంత్ రెడ్డికి ఆహ్వానం



ఇది కద నిజం: యాదగిరిగుట్ట దేవస్థానంలో వైభవోపేతంగా నిర్వహించనున్న వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు, అధ్యయనోత్సవాల సందర్భంగా డిసెంబర్ 30, 2025న జరిగే వైకుంఠ ఏకాదశి పర్వదినానికి హాజరై స్వామి వారిని దర్శించవలసిందిగా తెలంగాణ రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని దేవస్థాన కార్యనిర్వాహణాధికారి ఎస్. వెంకటరావు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం దేవస్థాన ప్రధానార్చకులు, అర్చకులు, వేద పండితులు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేసి ముఖ్యమంత్రిని ఆశీర్వదించారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని యాదగిరిగుట్టలో భక్తుల కోసం ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

# క్రిస్మస్ సెలవుల సందర్భంగా నెహ్రూ జూలాజికల్ పార్క్‌కు భారీగా సందర్శకులు



ఇది కద నిజం, హైదరాబాద్: క్రిస్మస్ పండుగతో పాటు సాధారణ సెలవులు ఉండటంతో హైదరాబాద్‌లోని నెహ్రూ జూలాజికల్ పార్క్‌కు భారీగా సందర్శకులు తరలివచ్చారు. గురువారం ఒక్క రోజే దాదాపు 23,440 మంది సందర్శకులు జూను సందర్శించినట్లు జూ అధికారులు తెలిపారు. గత సంవత్సరాల అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది కూడా సందర్శకుల రాక అధికంగా ఉంటుందని అంచనా వేసిన జూ యాజమాన్యం, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. జూ అంతటా అధికారులు, సిబ్బందిని విధుల్లో నియమించడంతో పాటు తగినంత తాగునీటి యూనిట్లను ఏర్పాటు చేశారు. సందర్శకులకు మార్గనిర్దేశం చేసేందుకు వివిధ ప్రదేశాల్లో అదనపు భద్రతా గార్డులను మోహరించారు.టికెట్ల జారీ ప్రక్రియ వేగవంతం చేసేందుకు అదనపు బుకింగ్ కౌంటర్లను ప్రారంభించగా, సందర్శకులకు సహకరించేందుకు జూ వాలంటీర్లను నియమించారు. పార్క్ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అదనపు పారిశుధ్య సిబ్బందిని ఏర్పాటు చేసి, డిస్పోజబుల్ వ్యర్థాలను వేగంగా తొలగించే చర్యలు చేపట్టారు. సందర్శకుల్లో వన్యప్రాణులపై అవగాహన పెంపొందించేందుకు జంతు సంరక్షకుల టాక్ షోతో పాటు పాములపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు.ఈ సందర్భంగా నెహ్రూ జూలాజికల్ పార్క్ క్యూరేటర్ శ్రీమతి జె. వసంత (ఐఎఫ్ఎస్) మాట్లాడుతూ, తమ సెలవు గమ్యస్థానంగా జూను ఎంచుకున్న సందర్శకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ జూల నుంచి జంతు మార్పిడి కార్యక్రమం ద్వారా జీబ్రా, మీర్కట్, సర్వల్ క్యాట్, బరసింఘా, వైట్ స్వాన్ వంటి కొత్త జంతు జాతులను జూ లో చేర్చడం వల్ల సందర్శకుల సంఖ్య మరింత పెరుగుతోందని తెలిపారు.బిప్రస్తుతం నెహ్రూ జూలాజికల్ పార్క్‌లో వివిధ దేశాలకు చెందిన 199 రకాల వన్యప్రాణులు ఉన్నాయని పేర్కొన్నారు. సెలవులు ఉన్నప్పటికీ విధి నిర్వహణలో నిబద్ధత చూపుతూ సందర్శకుల భారీ రాకను సమర్థవంతంగా నియంత్రించిన జూ సిబ్బందికి కూడా ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# మీరు అసూయ పడుతూనే ఉండండి..

## : అనసూయ లేటెస్ట్ పోస్ట్



తాను ఏ విషయంలోనైనా బాధ పడకుండా బలంగా ముందుకు సాగుతానని నటి అనసూయ అన్నారు. హీరోయిన్‌ల దుస్తులపై శివాజీ వ్యాఖ్యలు చేయడం తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. తన వ్యాఖ్యలపై ఆయన వివరణ ఇచ్చే క్రమంలో అనసూయ పేరును ప్రస్తావించగా ఆమె వరుస పోస్ట్‌లతో స్పందించారు. ఈ క్రమంలో తాజాగా ఎక్స్ వేదికగా కొన్ని పోస్ట్‌లు పెట్టారు.

"ప్రస్తుతం జరుగుతోన్న దాన్ని పక్కనపెడితే.. నేను ఏ విషయంలోనైనా నా అభిప్రాయాన్ని బలంగా వినిపిస్తాను. దేనికీ ప్రభావితం కాకుండా ధైర్యంగా నిలబడతాను. ఎన్నో ఏళ్ల నుంచి సమాజంలో నిర్లక్ష్యం చేసిన అంశాన్ని అర్థమయ్యేలా చెప్పి, దానిపై పోరాటం చేయడమే నా ఉద్దేశం. ఎన్ని జరిగినా చెప్పింది చేయడానికి నేను ఎప్పుడూ కట్టుబడి ఉంటాను. మీరు అలా అసూయపడుతూనే ఉండండి.. మేం మరింత శక్తిమంతంగా, ఆకర్షణీయంగా ముందుకుసాగుతాం" అని అనసూయ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు.

జరుగుతున్నదాన్ని చెప్పడం చేతకాక కొందరు తన వయసు గురించి ప్రస్తావిస్తున్నారని ఆమె అసహనం వ్యక్తంచేశారు. తాను ఫిట్‌గా, గ్లామరస్‌గా ఉన్నానని చెప్పారు. పాత తరం ఆలోచనలను మనం ముందుకుతీసుకెళ్లాల్సిన అవసరం లేదని ఆమె అభిప్రాయపడ్డారు.

# దేశం వదిలిపోదాం అనుకున్నాం.. 12 రోజులు నరకం చూశా..



నటుడు నందు హీరోగా నటించిన తాజా చిత్రం 'సైక్ సిద్ధార్థ' జనవరి 1న విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా జరిగిన ప్రచార కార్యక్రమాల్లో నందు తన గత చేదు జ్ఞాపకాలను గుర్తు చేసుకుని భావోద్వేగానికి గురయ్యారు. తను చేయని తప్పుకు తన పేరును వివాదాల్లోకి లాగడం, ఆ సమయంలో అనుభవించిన మానసిక వేదనను ఆయన పంచుకున్నారు. ముఖ్యంగా ఆ క్లిష్ట పరిస్థితుల్లో తన భార్య, ప్రముఖ సింగర్ గీతా మాధురి ఇచ్చిన మద్దతు గురించి చెబుతూ.. "మనకు బ్యాక్‌గ్రౌండ్ లేకపోతే ఇలాంటి ఇబ్బందులు వస్తాయని, అన్నీ వదిలేసి వేరే దేశానికి వెళ్లిపోయి హోటల్‌లో అయినా పని చేసుకుని బతుకుదాం" అని ఆమె అన్న మాటలు తనను ఇప్పటికీ కన్నీరు పెట్టిస్తాయని నందు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇండస్ట్రీలో నెపోటిజం మరియు తన కెరీర్ ప్లానింగ్ గురించి కూడా నందు స్పష్టత ఇచ్చారు. గతంలో కేవలం డబ్బు కోసమే కొన్ని తప్పుడు కథలను ఎంచుకున్నానని, ఆ ప్రభావం తన కెరీర్‌పై పడిందని ఆయన నిజాయితీగా ఒప్పుకున్నారు. అందుకే మూడేళ్ల విరామం తీసుకుని, ఈసారి మంచి కంటెంట్‌తో 'సైక్ సిద్ధార్థ' సినిమా చేశానని తెలిపారు. నెపోటిజం వల్ల అవకాశాలు రావచ్చు కానీ, ప్రతిభ ఉంటేనే ప్రేక్షకులు ఆదరిస్తారని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కొత్త సినిమాతో తప్పకుండా తనకంటూ ఒక మంచి గుర్తింపు వస్తుందని నందు ధీమా వ్యక్తం చేశారు



# అలాంటి పాత్ర దొరకడం నా అదృష్టం

## - అర్చన అయ్యర్

కెరీర్ ఆరంభంలో మంచి పాత్రలు రావడం అనేది అదృష్టంతో కూడుకున్నది. ముఖ్యంగా హీరోయిన్స్ విషయంలో. వారి కెరీర్ లో ముందుకు సాగడం ఇండస్ట్రీలో అంత ఈజీ కాదు. అయితే తాజాగా ఇదే విషయం పై నటి అర్చన అయ్యర్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. 'కృష్ణమ్మ' సినిమాతో మెప్పించిన ఈమె, ఇప్పుడు ఆది సాయికుమార్‌తో కలిసి 'శంబాల' అనే ఒక ఇంట్రెస్టింగ్ హారర్ థ్రిల్లర్‌లో నటించింది. ఈ సినిమా క్రిస్మస్ రోజు రిలీజ్ అయినా సందర్భంగా, అర్చన తన అనుభవాలను పంచుకుంది..అర్చన మాట్లాడుతూ.. 'కథ వినకుండానే ఓకే చెప్పేశా! సాధారణంగా ఏ హీరోయిన్ అయినా కథ మొత్తం విన్నాకే సినిమా సైన్ చేస్తారు. కానీ నేను మాత్రం 'శంబాల' కథ పూర్తిగా వినకుండా ఓకే చెప్పేశా. దానికి కారణం డైరెక్టర్ యుగంధర్ ముని చెప్పిన పాయింట్ అంతగా నచ్చింది.."ఈ సినిమా మొదలైన ఐదు నిమిషాలకే ఆడియెన్స్ ఒక కొత్త ప్రపంచం లోకి వెళ్ళిపోతారు. ఆ కథలో ఉండే గ్రిప్పింగ్ అలాంటిది" అని ఆమె కాన్ఫిడెంట్‌గా చెప్పారు. ఈ సినిమాలో తాను 'దేవి' అనే అమ్మాయిగా కనిపిస్తానని, ఆ పాత్ర చుట్టూనే కథ అంతా తిరుగుతుందని వివరించారు. అందుకే కథ కూడా వినలేదు' అని చెప్పుకొచ్చింది.. అంతే కాదు .'ఇప్పటికే ఇండస్ట్రీలోని కొంతమంది పెద్దల కోసం ఈ సినిమా స్పెషల్ షోలు వేశారు.. అది చూసిన చాలామంది దర్శకులు నాకు ఫోన్ చేసి,చాలా బాగా నటించారు.. మీకు మంచి ఫ్యూచర్ ఉంటుంది.. అని మెచ్చుకున్నారు. ఆ ఫోన్ కాల్స్ చూశాకే నాకు నమ్మకం కలిగింది, ఇంతటి గొప్ప అవకాశం వచ్చినందుకు ఇప్పటికీ నమ్మశక్యంగా లేదు' అని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. కేవలం జంప్ స్కేర్లు మాత్రమే కాకుండా, ఒక మంచి ఎమోషనల్ జర్నీ ఈ సినిమాలో ఉంటుందని, థియేటర్లలో ఈ సినిమా అందరికీ ఒక కొత్త ఫీలింగ్‌ను ఇస్తుందని అర్చన భరోసా ఇచ్చారు.